క్లుప్తంగా

కార్పొరేషన్ చైర్మన్ల నియామకం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్ల నియామక తక్షణం చేపట్టాలని దళిత సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన దళిత సేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, మాదిగ, లిడ్‌క్యాప్ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాలని, నిధులు కేటాయించాలని, ఈ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేసి, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సమావేశంలో దళిత సేన చింతలపూడి పట్టణ అధ్యక్షుడు మోసూరి కార్తీక్, పలువురు దళిత సేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం



అధ్యాపకురాలిని సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో నైతికతను పెంపొందించి వారికి విలువలు నేర్పడంలో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో చరిత్ర రీడర్ ఎం ఎస్తర్ కళ్యాణి, ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డీడీ రజని చేసిన సేవలు విశేషమని వక్తలు పేర్కొన్నారు. థెరిస్సా మహిళా కళాశాలలో శనివారం ఈ ఇరువురు అధ్యాపకుల పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ఎర్నెస్టీన్ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్పొరేషన్ పరిధిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 08812 222200, 08812 232101కు తెలియజేయాలని ప్రజలను కోరారు. కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఇక్కడ పని చేస్తారని, ప్రజల నుంచి వచ్చే ప్రతి విషయాన్నీ నమోదు చేసి అధికారులకు తెలియజేస్తారని కమిషనర్ తెలిపారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

- ఏలూరు నగరంలో స్తంభించిన జనజీవనం
- కార్యాలయాలు, క్రీడా ప్రాంగణాల్లో చేరిన నీరు



ఏలూరు 12 పంపుల సెంటరులో వర్షపునీరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కురుస్తోన్న వర్షానికి ఏలూరు నగరంలోని దాదాపు అన్ని రహదారులూ జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. శుక్రవారం ఉదయం ఒక మోస్తరుగా కురిసిన వాన అర్ధరాత్రి నుంచి ఉధృత రూపం దాల్చింది. అప్పటి నుంచి నిరంతరాయంగా వర్షం కురుస్తునే ఉంది. శనివారం ఉదయానికి వీధుల్లోని రోడ్లపై వర్షం నీరు ప్రవహిస్తూ కనిపించింది. కొన్ని పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు వర్షం నీటితో చెరువుల్లా మారాయి. రోజంతా వాన కురుస్తూనే ఉండడంతో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు కనపించలేదు. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ విషయంపై సమయానికి సమాచారం అందక చాలా మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్పటికే వానలో తడుచుకుంటూనే విద్యా సంస్థలకు చేరుకున్నారు. అక్కడికి వెళ్లిన తరువాత సెలవని తెలవడంతో తిరుగుప్రయాణమయ్యారు.

కార్యాలయాలు జలదిగ్బంధం

దాదాపు 36 గంటల నుంచి కురుస్తున్న వర్షానికి నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు చెరువులను తలపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా రిజిస్ట్రార్, రైల్వేస్టేషన్ వద్ద ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ తదితర కార్యాలయాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. నగరంలోని పుష్పలీలా నగర్, బీడీ కాలనీ, తంగెళ్ల మూడిలోని కొంత ప్రాంతం, కొమడవోలు, బావిశెట్టివారి పేట, యానాదుల కాలనీ తదితర ప్రాంతాలు సైతం జలమయమయ్యాయి. ప్రజలు మోకాలి లోతు నీటిలో తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పత్తేబాద రైతు బజారులో ఉదయం 8 గంటలకే మోకాలి లోతు నీరు చేరింది. నగర ప్రజలు నీటిలోనే తిరిగి కూరగాలయను కొనుగోలు చేయాల్సి వచ్చింది.

వీడని వాన

గడిచిన 24 గంటల్లో నగరంలో 46.4, ఏలూరు మండలంలో సైతం 46.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నిరంతరాయంగా వర్షం కురుస్తునే ఉండడంతో పవర్‌పేట రోడ్డు, రామచంద్రరావు పేట, సెయింట్ థెరిస్సా పాఠశాల, ఇండోర్ స్టేడియం రోడ్డు, అమీనా పేట రోడ్డు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో నీరు రహదారులపై డ్రెయినేజీ మురుగుతో కలిసి ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లింది. శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న రాజీవ్ స్నేహవారధిలో నీరు చేరడంతో అండర్‌పాస్‌ను మూసివేశారు. దీంతో వన్ టౌన్ నుంచి టూటౌన్‌కు, టూ టౌన్ నుంచి వన్‌టౌన్‌కు వెళ్లేవారు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.



లోతట్టు ప్రాంతాలకు చేరిన వర్షపునీరు



వర్షపు నీటితో మునిగిన ఏలూరు ప్రభుత్వాసుపత్రి రోడ్డు

తమ్మిలేరు పరీవాహక ప్రాంతాల పరిశీలన



అమీనాపేటలోని తూర్పు, పడమర లాకుల పటిష్టతపై ఆరా తీస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాల నేపథ్యంలో తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు అర్బన్‌లోని లోతట్టు ప్రాంతాలను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. సాయినగర్, కొమడవోలు, శనివారపు పేట కాజ్‌వే తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రానికి తరలించేందుకు సిద్ధంగా ఉండాదని అన్నారు. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు, తమ్మిలేరు గట్ల పటిష్టతకు ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. శనివారపు పేట కాజ్‌వే వద్ద వరద ఉధృతిని బట్టి రాకపోకలను నిలిపివేసి ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, ఇరిగేషన్ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, డీఈ వై.అర్జునరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, తహసీల్దార్ శేషగిరి తదితరులు ఉన్నారు.

రక్షణ చర్యలపై ఆరా

ఏలూరు టౌన్: తమ్మిలేరు పరీవాహ ప్రాంతమైన అమీనాపేటలో బ్రిడ్జి పడమర లాకులు, తూర్పు లాకులు, వైఎస్సార్ కాలనీ ప్రాంతాల్లో రక్షణ చర్యలపై ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆరా తీశారు. ఏలూరు నగరంలో తమ్మిలేరు ఏటు గట్టు పటిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ప్రమాద నివారణ చర్యలపై డీఎస్పీ డీ.శ్రావణ్ కుమార్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎస్సై మదీనా బాషా, అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ప్రమాదాలు జరగకుండా వాగులు, ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సిబ్బందిని నియమించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపు పేటలోని హజరత్ సయ్యద్ జమాల్ షా ఖాదరీ వలి మహా త్ముని ఉరుసు ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంగర్ ఖానీ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నాత్ ఖానీ (దీపారాధన) చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దర్గా వంశపారంపర్య ముజావర్లు మహమ్మద్ అన్వర్ షరీఫ్, మహబూబ్ షరీఫ్, అమీర్‌జాన్ జాఫర్ షరీఫ్ పర్యవేక్షించారు.

ఇంట్లో బంగారు నగలు మాయం

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో ఇంట్లోని బంగారు నగలు మాయం అయ్యాయి. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం. తంగెళ్లమూడి నేతాజీనగర్‌లోని ఒక అపార్టుమెంటులో నివాసముంటున్న చిన్నం విజయ భాస్కర్‌రావు శనివారం తన భార్యతో కలిసి ఆసుపత్రికి వెళ్లారు. ఇంటి నుంచి బయటకెళ్లే సమయానికి పనిమనిషి రావటంతో ఇంటికి తాళం వేయకుండా ఆమెకు అప్పగించారు. ఆమె ఇంట్లో పనులు ముగించుకున్న అనంతరం తలుపుకు తాళం వేసి అపార్టుమెంటు వాచ్‌మెన్ భార్యకు తాళాలు ఇచ్చి వెళ్లిపోయింది. ఆసుపత్రిలో చూపించుకుని తిరిగి విజయభాస్కరరావు దంపతులు ఇంటికి వచ్చి తాళం తీసుకుని లోపలకు వెళ్లారు. ఇంట్లో బీరువాలో ఉన్న మూడున్నర కాసుల బంగారు నగలు కనిపించలేదు. విజయభాస్కరరావు రూరల్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయటంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన ఏడు వారాల వ్రత మహోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్‌లోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఏడు వారాల వ్రత మహోత్సవాలు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఉదయం నుండే భక్తులందరూ స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్య అర్చన, గోవింద నామస్మరణ,విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా నవగ్రహాల పూజలు, గణపతి హోమం చేశారు. భక్తులు పాల్గొని సామూహిక వ్రతాలు ఆచరించారు. దివంగత వెన్నెలకోట లోకనాథం జ్ఞాపకార్థం వెన్నెలకోట జ్యోతి ఆలయ రాజ పోషణ నిమిత్తం రూ.లక్ష, మలపురెడ్డి మోహ, సత్యవతి రూ.50 వేలు విరాళం ఆలయ కమిటీ ప్రతినిధి త్రిపర్ణ రమణకు అందజేశారు. మహిళా కమిటీ ప్రతినిధి వెన్నెల కోట శ్రీనివాస్ హేమలత పాల్గొన్నారు.

వృద్ధురాలి సొమ్ము అపహరణ

ఏలూరు టౌన్: వృద్ధురాలి సొమ్మును అపరిచిత వ్యక్తి ఏటీఎం సెంటర్‌లో కాజేశాడు. ఏటీఎం సెంటర్లో సొమ్ము డ్రా చేసుకోవడానికి వెళ్లిన వృద్ధురాలిని ఆ వ్యక్తి మోసగించి కార్డు అపహరించి రూ.20 వేల నగదు డ్రా చేసుకున్నాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మేరుగు కాంతమ్మ (60) వట్లూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పక్కనే ఉన్న ఏటీఎంకు డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. అక్కడే గుర్తు తెలియని వ్యక్తి ఉండడంతో సొమ్ములు డ్రా చేసి ఇమ్మని కోరింది. అతను డబ్బులు డ్రా చేసి ఇచ్చి ఆ కార్డును మార్చేశాడు. అనంతరం వృద్ధురాలి కార్డులోని రూ.20 వేల నగదు అపహరించాడు. బాధితురాలు త్రీ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టాపరు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అవినాష్ రాజు

దెందులూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి మార్గదర్శకులని, చరిత్ర ఉన్నంతకాలం ఆయన కీర్తిప్రతిష్టలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని లయన్స్ క్లబ్ డైరెక్టర్ చుక్కా అవినాష్‌రాజు అన్నారు. శనివారం ఉండ్రాజవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ పోతునూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్నా ఆశీర్వాదం విగ్రహాన్ని బహూకరించగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఉండ్రాజవరం గ్రామస్తులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జరజాపు రంగారావు రెయిలింగ్ నిమిత్తం రూ.40 వేలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు బీవీ రమణమూర్తి, లయన్స్ క్లబ్ నాయకులు రంగారావు, శరీష్, ఎంపీటీసీ సున్నా నరేష్ అన్నారు. ఉండ్రాజవరం గ్రామస్తులు దాతలను అభినందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన పి.వెంకటేష్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేషనల్ హైవేపై అధికారుల నిర్లక్ష్యం



జాతీయరహదారిపై సిగ్నల్ స్థానంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డివైడర్

దెందులూరు: విజయవాడ–రాజమండ్రి నేషనల్ హైవే 24 గంటలూ రద్దీగా ఉండే రహదారి. ప్రతిరోజూ రెండువైపులా లక్షలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. మండలంలోని గుండుగొలను వంతెన సమీపంలో డబుల్ రోడ్డు వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్అండ్‌బీ అధికారులు ప్లాస్టిక్ డ్రమ్ము పెట్టి చేతులు దులుపుకున్నారు. గరుడ హోటల్ నుంచి గుండుగొలను వంతెన సమీపంలో ఏడాది లోపు అనేక ప్రమాదాలు చోటుచేసుకుని అనేక మంది మరణాలు కోల్పోయారు. రాత్రివేళల్లో అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది. సిగ్నల్ లేక తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే గరుడ హోటల్‌కు ముందు రెండు వైపులా సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

జ్వరాలను అశ్రద్ధ చేయొద్దు



చేబ్రోలు బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు

ఉంగుటూరు: జ్వరాలు పట్ల అశ్రద్ధ చేయవద్దని, సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. శనివారం చేబ్రోలు ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలకు ఏ వ్యాధి వచ్చినా ఆరోగ్య సిబ్బందికి వార్డెన్ తెలియజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వారానికి ఒక రోజు ఐరన్ మాత్రలు పిల్లలు వేసుకోవాలన్నారు. వసతి గృహ పరిసరాల్లో డ్రైడే పాటించాలన్నారు. వసతిగృహం సంక్షేమ అధికారిణి కె.మారాబాయ్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి కె.రత్న రాజ్యం పాల్గొన్నారు.

జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తం

దెందులూరు: కొవ్వలిలో జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్ఓ శర్మిష్ట, దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం, వైద్యులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. కొవ్వలిలో 50 మందికిపైగా, దెందులూరులో జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్న సంగతి విదితమే. గ్రామస్తుల కోరిక మేరకు కొవ్వలిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పోతునూరు వైద్యశాల సిబ్బంది బాధితులకు వైద్య సేవలందించారు. అనంతరం గోపన్నపాలెం పీహెచ్‌సీని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్.కృపావరం, తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత పాల్గొన్నారు.

వనమహోత్సవం నిరంతరం కొనసాగాలి

దెందులూరు: వనమహోత్సవం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, మొక్క నాటినవారు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపడితేనే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని దెందులూరు ఇండియన్ బ్యాంకు మేనేజర్ సీజేఎస్ లక్ష్మి దుర్గ అన్నారు. శనివారం ఇండియన్ బ్యాంక్ స్టాఫ్, నర్సింగ్ కళాశాల స్టాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో దెందులూరులో రోడ్డుకిరువైపులా, సచివాల యం, నర్సింగ్ కళాశాలలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో బ్యాంకు స్టాఫ్ సునీత, అనిల్‌కుమార్, రామకృష్ణ, నారాయణ, నర్సింగ్ విద్యార్థులతో, కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ప్రతిజ్ఞ చేయించారు.

దెందులూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం అన్నారు. శనివారం ఉదయం తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ వి.శ్రీలత, మండలాధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో భారీ వర్షాలు, లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు గ్రామ స్థాయి ఉద్యోగులకు డ్యూటీల ఏర్పాటు, జేసీబీల సంసిద్ధత, విద్యుత్ సమస్యలపై శాఖల వారీగా, గ్రామాల వారీగా సమీక్షించారు. మూడు రోజులు పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులను రద్దు చేశారు. గుండేరు, మొండుకోడు డ్రెయిన్ల వద్ద నిఘాను కట్టుదిట్టం చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉంది భారీ వర్షాల అనంతరం పరిస్థితులపై అన్ని శాఖల ఉద్యోగులు జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు.

అధిక ఆదాయం దిశగా పొలంబడి సాగాలి

ఉంగుటూరు: ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శనివారం ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో వ్యవసాయ శాఖ పొలంబడి పోస్టరును ధర్మరాజు ఆవిష్కరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	36
కాకర కాయలు	30	కీరా దోస	50
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	50	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	54

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	05
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	13
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	15
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు - తిరుపతి	16.00	4830	27